క్లుప్తంగా

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



పెనుగంచిప్రోలు: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు జెడ్పీ నిధులు రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న తారురోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులను మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు ఊట్ల నాగేశ్వరరావు, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, రంగిశెట్టి దుర్గాప్రసాద్, వెంకటనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన



నందిగామ: వాహనం నడిపే ప్రతీ డ్రైవర్ రహదారి భద్రత పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మోటార్ వాహన తనిఖీదారు ఎంవీఎస్ రాజు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎంవీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట: విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని పేట ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జేఆర్సీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారం వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు ఆర్ నరసింహారావు, పెనుగొండ వెంకటరాజు, నాగరమేష్, తిరుపతిరావు, అబ్బులు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



వత్సవాయి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకటరాజారావు సూచించారు. మండల కేంద్రం వత్సవాయిలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమన్నారు. మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది రాజారావు దంపతులను సన్మానించారు.

ఆరోగ్యశ్రీతో విలువైన వైద్యం



జగ్గయ్యపేట అర్బన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు రూ. 25 లక్షల విలువైన వైద్య సేవలను అందిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. స్థానిక 12వ సచివాలయం పరిధిలోని 25, 26 వార్డుల్లో మంగళవారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ఏకంగా రూ. 25 లక్షలకు పెంచి ఏ ఆస్పత్రికి వెళ్లినా వైద్యం చేయించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుందరమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

చాట్రాయి: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, కారంగుల వాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు

తోటచర్ల(పెనుగంచిప్రోలు): ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలందించేందుకుగానూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం తోటచర్ల గ్రామంలో రూ. 40.60 లక్షలతో నిర్మించే సచివాలయ భవనం, గ్రామంలో తాగునీటి కోసం 8 చోట్ల మినీ ట్యాంక్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన, డ్వాక్రా మహిళలకు రూ. 2,19,78,709 ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారన్నారు. మహిళలే జగనన్న సైన్యమని, మన కోసం 124 సార్లు బటన్ నొక్కిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కల్లబొల్లి మాటలు చెప్పే దుష్ట చతుష్టయాన్ని ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కునగుంట్ల రాములమ్మ, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి, ఎంపీడీఓ సాయిహర్ష, వైఎస్సార్ సీపీ మండల, గ్రామాధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, ముత్తినేని హనుమంతరావు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ డైరక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, ఉపసర్పంచ్ కాకాని వెంకటకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కునగుంట్ల కోటేశ్వరరావు, సాంబశివరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, విప్ ఉదయభాను



పోచంపల్లి తారురోడ్డు ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

పోచంపల్లి గ్రామం రోడ్డు ప్రారంభం

పోచంపల్లి(జగ్గయ్యపేట): పోచంపల్లి గ్రామానికి 65వ నెంబర్ జాతీయ రహదారి నుంచి రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన తారురోడ్డును మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా జాతీయ రహదారి నుంచి గ్రామానికి తారు రోడ్డు వేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను, విజయవాడ ఎంపీ కేశినేని నానిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ భవనానికి ఆయన భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన గ్రామానికి చెందిన చావా నరసింహారావు దంపతులను ఉదయభాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెడవెల్లి పరమేశ్వరరావు, ముదిరాజు సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు గుడూరు లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ మండవ శ్రీనివాసగౌడ్, గ్రామ పార్టీ కన్వీనర్ మన్నెం శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ, ఈఈలు కిరణ్, శ్రీనివాసరావు, సుందరమూర్తి, కార్యదర్శి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పెండ్యాల/వేములపల్లి(కంచికచర్ల): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల, వేములపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులమత రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మఒడి, విద్యాదీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని వివరించారు. ప్రతినెలా ఒకటవ తేదీన పొద్దు పొడవక ముందే పింఛన్ అందజేస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి సీఎం తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలని లబ్ధిదారులందరూ ఆశీర్వదిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచ్ ఉయ్యూరు అనుమాయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, మాజీ సర్పంచ్ షేక్ ఖాజాపాషా, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, మల్లారెడ్డి, నాయకులు పీర్‌సామియా, నిస్సార్‌పాషా, సిద్దిక్‌బాషా చాన్‌బహుదూర్, జే నాగేశ్వరరావు, ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు బ్రహ్మం, కాంతారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచించారు. చిల్లకల్లు గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా అభివృద్ధి చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్యులే నేరుగా ఇళ్ల వద్దకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యులు కూడా సురక్ష శిబిరాలపై అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రవంతి, కీర్తిరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్‌లు వెంకట్రావ్, అలివేలు, గ్రామ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రంజింప చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ నటరాజ సాంస్కృతిక కళాపీఠంకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను రంజింపచేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు పల్లవి, కణ్వాల, ఉజ్వల సాయి, నిత్యశ్రీ, అనిత, జ్ఞానదీపిక, చార్వి, దీపిక, సహస్ర, నిర్వాణ పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే

నందిగామ: ప్రభుత్వం భూముల రీసర్వే కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తహసీల్దార్ సరస్వతి అన్నారు. మండలంలోని ఐతవరం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీసర్వే స్టోన్ ప్లాంటేషన్(సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమం)పనులను మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రీసర్వే పూర్తయిన భూములకు స్టోన్ ప్లాంటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత భూముల రైతులు దగ్గరుండి సహకరించాలన్నారు. అదేవిధంగా మండలంలోని రాఘవాపురం సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పనులను పరిశీలించడంతోపాటు సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. తహసీల్దార్ వెంట పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



స్టోన్ ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరస్వతి

నేడు తలంబ్రాల బియ్యం కలపడానికి ఆహ్వానం

పెనుగంచిప్రోలు: శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ముత్తైదువులతో బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయంలో తలంబ్రాల బియ్యం కలిపేందుకు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ కే రమేష్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవం ఈ నెల 23వ తేదీ రాత్రి గం.9-23 నిముషాలకు జరగనుందని వెల్లడించారు. కావున ఆసక్తి కలిగిన భక్తులు తలంబ్రాలు కలిపే కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

నక్కలంపేట సొసైటీ అధ్యక్షుడిగా యరమరెడ్డి



పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల శివారు నక్కలంపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా యరమరెడ్డి నరసింహారావును నియమించడం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు నియామక పత్రాన్ని అందజేశారని గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు నరసింహారావు మాట్లాడుతూ రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

నగదు చోరీపై కేసు నమోదు

నందిగామ: ఓ వ్యక్తి బ్యాంకు నుంచి డబ్బు తీసుకువెళుతున్న సందర్భంలో చోరీకి గురైన ఘటన మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని ఓ బ్యాంకు నుంచి లక్ష రూపాయలు రుణం తీసుకున్నాడు. తీసుకున్న నగదును సైకిల్‌పై పెట్టుకుని వెళుతూ మార్గమధ్యంలో రామన్నపేట రోడ్డులో ఓ టీ స్టాల్ వద్ద ఆగాడు. ఆ సమయంలో బైకుపై వచ్చిన ఒక వ్యక్తి నగదు బ్యాగ్ తీసుకుని పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాదీఖానా నిర్మాణంపై కేసు విరమించుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: షాదీఖానా నిర్మాణాన్ని ఆపివేయాలని కోర్టులో వేసిన కేసులు వెంటనే వెనక్కు తీసుకుని షాదీఖానా నిర్మాణానికి సహకరించాలని పలువురు ముస్లిం సోదరులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని శాంతినగర్ పుట్టబజారులో సుమారు ఆరు కోట్ల రూపాయల విలువైన 29 సెంట్ల స్థలంలో రూ. 75 లక్షలతో చేపట్టిన షాదీఖానా నిర్మాణాన్ని టీడీపీ నాయకులు కేసులు వేయించి నిలుపుదల చేయడాన్ని నిరశిస్తూ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలి వద్ద నియోజకవర్గ స్థాయిలో ముస్లిం సోదరులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో నాల్గవ రోజుకు చేరుకుంది. జామియా మసీదు కమిటీ సభ్యుడు సయ్యద్‌ఆలీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ ఎక్బైస్డ్ బాషా, జామియా మసీదు కమిటీ సభ్యులు రహంతుల్లా, అల్లా భక్షు, మైనార్టీ నాయకులు షేక్ సైదా, మెహబూబ్‌ఖాన్, షేక్ జలీల్, షేక్ మూసా పాల్గొన్నారు. కాగా ఈ దీక్షా శిబిరాన్ని కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ తన్నీరు నాగేంద్రం, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పార్టీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు బద్దూనాయక్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

వీరులపాడు: మండలంలోని జుజ్జూరుఅల్లూరు, జగన్నాథపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రౌడీ షీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని అవాంఛనీయ ఘటనలకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మహాలక్ష్మణుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

16న గవర్నర్ చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 31వ వార్డులో జాతీయ రహదారి పక్కన ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 150 అడుగుల జాతీయ జెండాను 16వ తేదీన ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. పుర పాలక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నేతృత్వంలో ఎకరన్నర స్థలంలో రూ. 60 లక్షలతో చుట్టూ అందమైన పార్కు, వాటర్ ఫౌంటెయిన్ తదితర సుందరమైన హంగులతో జగ్గయ్యపేట వైభవాన్ని చాటేలా దీనిని రాష్ట్ర సరిహద్దులో రూపొందించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



గవర్నర్ ఆవిష్కరించనున్న 150 అడుగుల జాతీయ పతాకం

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


తిరువూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా గ్రామ స్థాయిలో ఆదాయ వనరులు పెంచుకోవడం, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి ప్రజలను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలు రూపొందించుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

జయంతి(వీరులపాడు): ది జయంతి నేతాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్ వెంకటరెడ్డి మృతి బాధాకరమని సంఘ చైర్మన్ జంగా కోటిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వెంకటరెడ్డి కుటుంబ సభ్యులకు సహకార సంఘం ద్వారా మట్టి ఖర్చులకు మంజూరైన రూ. 10 వేలను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో రుణ గ్రహీతలుగా ఉండి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సంఘం ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

పోస్ట్ కోవిడ్ రోగులకు వైద్యుల సలహాలు తప్పనిసరి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరోనా వచ్చిన వారంతా భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా వైద్యుల సూచనలు తీసుకోవడం మంచిదని అమెరికాకు చెందిన బయో అమెరికా రీసెర్చ్ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లోని విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం సాయంత్రం వ్యాధి నిరోధక శక్తి, కోవిడ్-19 ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కరోనా వచ్చిన వారు గత రెండు సంవత్సరాల నుంచి అధికంగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. లంగ్స్, ఊపిరితిత్తులతో పాటు పలు అవయవాలకు కూడా ముప్పు వాటిల్లుతోందన్నారు. కరోనా వచ్చిన తర్వాత శరీరంలో అనారోగ్య పరిస్థితులు వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, అసోసియేషన్ కార్యదర్శి టీవీ నాగేశ్వరరావు, జేఆర్‌డీ టాటా ఐలా కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఏపీ ఎంఎస్ఎంఈఐఏ కార్యదర్శి ఎంఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న శ్రీనివాసరావు

శ్రీతిరుపతమ్మవారిని దర్శించుకున్న డీసీపీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ కే శ్రీనివాసరావు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అలాగే నందిగామ ఏసీపీ డా. రవికిరణ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్సై పీ రాంబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీవైఈఓ సీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. స్థానిక సత్యనారాయణపురం ఎస్ఆర్ఐ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహణను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో రాణించిన హేమంత్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శ్రీగౌతమ్‌కు చెందిన విజ్ఞి హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని స్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు అన్నారు. స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హేమంత్‌కుమార్‌ను ఆయన అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన పోటీలలో అండర్-13 విభాగంలో హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం

తిరువూరు: తిరువూరు మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశం స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం నిర్వహించారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధం తదితర విధుల నిర్వహణపై ఎస్ఐ సత్యనారాయణ సూచనలిచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి మహిళా సంరక్షణ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.